సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

శనివారం నగర పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి పలువురు ప్రముఖులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎంకు హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, డీజీపీ రవిగుప్తా, సీఎస్ శాంతికుమారి, మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమొక్కలు, పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు. - సాక్షి నెట్‌వర్క్



సీఎం రేవంత్‌రెడ్డికి పూలమొక్క అందజేస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, డీజీపీ రవిగుప్తా, స్వాగతం పలుకుతున్న మంత్రి సురేఖ, ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి, సీఎస్ శాంతికుమారి, సీఎస్‌కు మొక్క అందజేస్తున్న కలెక్టర్ సత్యశారదాదేవి, డీజీపీకి బొకే ఇస్తున్న సీపీ

క్లుప్తంగా

కార్యాలయ భవన నిర్మాణానికి భూమి కేటాయించాలి



వరంగల్: వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ భవన నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించాలని డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కోరారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు పీసీసీ నాయకుడు ఎర్రబెల్లి వరద రాజేశ్వర్‌రావు తెలిపారు.

నేడు సదస్సు

నర్సంపేట : పట్టణంలోని శ్రీ సత్యసాయిబాబా సేవా సమితి కార్యాలయంలో నేడు (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు ఆదిగురు భారత సంఘం, శ్రీసత్య సాయి బాబా సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం, గో ఆధారిత ఉత్పత్తుల సదస్సు నిర్వహించనున్నట్లు బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథులుగా సత్యసాయిబాబా సేవా సమితి కన్వీనర్ డాక్టర్ నందకిశోర్, ఏబీఎస్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు పి.మొండయ్య, శాంతిసేన రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, మూలికా వైద్య నిపుణుడు నాగభూషణం, సీనియర్ సేంద్రియ రైతు, ఉత్తమ రైతు అవార్డు గ్రహీత కుడుముల వెంకట్రాంరెడ్డి, విజయవాడ గో ఆధారిత వ్యవసాయ నిపుణులు రంజాన్ రమేష్ పాల్గొంటారని తెలిపారు. సదస్సుకు హాజరయ్యే వారికి వరి, మూలికలు, కూరగాయ విత్తనాలు, గో కృపామృతం ఉచితంగా పంపిణీ చేస్తామని వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండలోని రంగనాయకులస్వామి గుట్ట ప్రాంగణంలో చేపట్టిన శ్రీసీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బెజ్జం సంపత్ జ్ఞాపకార్థం అతడి సతీమణి విజయ, కూతురు కావ్య శనివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా నగదును ఆలయ కమిటీ బాధ్యులకు అందజేశారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు.

పంచాయతీరాజ్ ఉద్యోగి రవీందర్ మృతి



రవీందర్ (ఫైల్)

వరంగల్: వరంగల్ సంగెం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న పంచాయత్‌రాజ్ విభాగానికి చెందిన ఉద్యోగి నాగుల రవీందర్ (52) శనివారం మృతి చెందారు. నెలరోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో స్వగ్రామం ములుగు జిల్లాలోని ఏటూరునాగారానికి తరలించగా మృతిచెందారు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, రవీందర్ అంత్యక్రియలు ఆదివారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

నివాళి



రాయపర్తి : మండలంలోని పోతిరెడ్డిపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మందపురి అశోక్ తండ్రి నర్సయ్య మృతి చెందగా ఆయన మృతదేహానికి ఆ పార్టీ నాయకులు శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, నాయకులు చిన్నపాక ఎల్లయ్య, మందపురి మహేందర్, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

నేడు మహాజన సభ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక మహాజన సభ నిర్వహిస్తామని సొసైటీ కార్యదర్శి ఓంప్రకాశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బాబోయ్.. ట్రాన్స్‌ఫార్మర్

● తరలింపులో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

దుగ్గొండి : బాబోయ్.. ట్రాన్స్‌ఫార్మర్ అంటూ జనం బెంబేలెత్తుతున్నారు. మండలంలోని నాచినపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట గిర్నిబావి–పొనకల్ రహదారిని ఆనుకుని ఉన్న 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండగా దాన్ని వేరే ప్రాంతానికి తరలించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పని చేసిన ముగ్గురు కలెక్టర్లు ఆదేశించినా అధికారులు పట్టించుకున్న దాఖలాల్లేవని పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. స్థానికంగా చర్చనీయాంశంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ సమస్యపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

నాచినపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయానికి ప్రతీరోజు వివిధ పనుల నేపథ్యంలో ప్రజలు రావడం పరిపాటి. కార్యాలయంలో నిత్యం వృద్ధులు, మహిళలు, వికలాంగులతో సందడి సహజం. కాగా గ్రామ పంచాయతీ ఎదుట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన ఫ్యూజులు, స్టేవైర్లు గేటుకు తగిలేలా ఉన్నాయి. ఈ క్రమంలో ఎవరయినా ఏమరపాటుగా వెళితే విద్యుదాఘాతానికి గురికావడం ఖాయం. అయినా విద్యుత్ శాఖ అధికారులు కొనేళ్లుగా పట్టించుకోవడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందని 2017లో నాటి కలెక్టర్ హరిత స్వయంగా గుర్తించి అక్కడి నుంచి తొలగించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అయినా పట్టించుకోలేదు. అనంతర కాలంలో కలెక్టర్లుగా పని చేసిన ప్రశాంత్ జీవన్ పాటిల్, గోపీలకు తాజా మాజీ సర్పంచ్ పెండ్యాల మమత–రాజు ఫిర్యాదు చేయగా ట్రాన్స్‌ఫార్మర్‌ను డీబీఎం–38 కాల్వ గట్టు పక్కకు మార్చాలని దిశానిర్దేశం చేశారు. అయినా ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే ప్రదేశానికి మార్చలేదు. కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్న క్రమంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను రక్షిత ప్రదేశానికి మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



జీపీ ఎదుట ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం



పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రమాదకరంగా ఉన్న త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సురక్షిత ప్రదేశానికి మార్చాలని గతంలో పలుమార్లు కలెక్టర్లకు ఫిర్యాదు చేశాము. అయినా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోలేదు. వ్యవసాయ బావులకు కరెంట్ అందించే ట్రాన్స్‌ఫార్మర్‌ను దగ్గరలోనే ఉన్న కాల్వ గట్టు పక్కకు మార్చితే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. వర్షం కురిస్తే పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎనిమిదేళ్లుగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాలి.

-పుచ్చకాయల కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా నాయకుడు, నాచినపల్లి

వివక్ష చూపితే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఐ నరేందర్

నెక్కొండ : ఇతరుల పట్ల వివక్షకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆర్ఐ నరేందర్ స్పష్టం చేశారు. మండలంలోని నెక్కొండ తండా జీపీ పరిధిలో శనివారం నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలో అంటరానితనం దుర్మార్గమని చెప్పారు. అంటరానితనం పాటిస్తే అభివృద్ధిలో వెనకబడిపోతామని తెలిపారు. ప్రజల హక్కులు, విధుల గురించి అవగాహన కల్పించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను సమాజంలోని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏపీఎం శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, ఏఈఓ వసంత పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్‌లో ఎంఈఓ విచారణ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

నల్లబెల్లి : ఏఐఎఫ్‌డీఎస్ ఫిర్యాదు మేరకు మండలంలోని శ్రీ ఆదర్శవాణి విద్యానికేతన్ స్కూల్‌లో ఎంఈఓ చదువుల సత్యనారాయణ శనివారం విచారణ చేపట్టారు. ఆయన పాఠశాలకు చేరుకుని రికార్డులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్‌తోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులతో వేర్వేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, సీఆర్‌పీ రవి, తదితరులున్నారు.

'టెక్స్‌టైల్' నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

నర్సంపేట : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం సంగెం, గీసుకొండ మండలాల పరిధిలో సుమారు 1300 ఎకరాల రెండు పంటలు పండే భూమిని రైతుల నుంచి బలవంతంగా సేకరించిందని చెప్పారు. ఎనిమిదేళ్లు గడచినా పరిశ్రమలు ఏర్పాటు చేయలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం ఇవ్వడంతోపాటు ఉపాధి, నివాసం కల్పించాలని, పరిశ్రమలకు ఉపయోగపడని భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని, వెంటనే పార్కు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ సన్మాన సభ



నర్సంపేట : రమేశ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్, తదితరులు



చెన్నారావుపేట : గోవిందరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది



పర్వతగిరి : సత్యనారాయణను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) గణిత శాస్త్ర లెక్చరర్ తోట రమేశ్ శనివారం ఉద్యోగ విరమణ చేయగా సన్మాన సభ నిర్వహించారు. సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించగా రమేశ్‌ను ప్రిన్సిపాల్, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. రమేశ్ సుమారు మూడు దశాబ్దాలకుపైగా ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కేయూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ తిరుమలదేవి మాట్లాడుతూ రమేశ్ బోధనలో క్రియాశీలకంగా వ్యవహరించే వారని తెలిపారు. కార్యక్రమంలో పింగిలి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, తొర్రూరు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాములు, ఆర్‌సీటీపీ బాధ్యులు పులి సారంగపాణి, డాక్టర్ సత్యనారాయణ, కళాశాల సీపీడీసీ సభ్యుడు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, ఎల్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ గోవిందరావుకు..

చెన్నారావుపేట : ఎంపీడీఓగా బండి గోవిందరావు అందించిన సేవలు మరువలేనివని ఎంపీపీ బాదావత్ విజేందర్, జెడ్పీటీసీ బానోతు పత్తినాయక్, సూర్యాపేట జిల్లా డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, సూర్యాపేట జెడ్పీ సీఈఓ అప్పారావు, ఖమ్మం డీఆర్‌డీఏ డీసీఎం శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ జెడ్పీ డిప్యూటీ సీఈఓ పవన్‌కుమార్, సూపరిండెంటెంట్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉద్యోగ విరమణ సందర్భంగా స్థానిక రైతు వేదికలో ఎంపీడీఓ గోవిందరావును ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడారు. గోవిందరావు సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. ఎంపీడీఓ గోవిందరావు–నిర్మల దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీఓ శ్రీధర్‌రాజు, సూపరింటెండెంట్ దయాకర్, ఎంఈఓ రత్నమాల, ఎంపీఓ అరుణ, ఏపీఎం ఈశ్వర్, డాక్టర్ సరోజన, రిటైర్ట్ ఎంపీడీఓలు చలపతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శికి..

పర్వతగిరి : మండలంలోని బూరుగుమల్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి జూకంటి సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన్ను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కమల పంతులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సర్వర్, ఎంపీడీఓ శంకర్, ఏంపీఓ పాక శ్రీనివాస్, ఎంపీటీసీలు రాజు, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులతో సరి

కాలం చెల్లినా మార్చని వైనం

● 40 ఏళ్లుగా సమస్యతో సతమతం

● కలుషిత నీరే సరఫరా



కాలం చెల్లిన పైపులైన్



మరమ్మతు కోసం పగులగొట్టిన రోడ్డు

పర్వతగిరి : మండల కేంద్రంలో తాగునీటి వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. సుమారు 40 ఏళ్ల క్రితం నాటి పైపులైన్లు లీకేజీకి గురవుతున్నా గత పాలకులు వాటిని మార్చకుండా మరమ్మతులతో సరిపెట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నేళ్లుగా గ్రామానికి కలుషిత నీరే సరఫరా అవుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వెడల్పు పనులు చేపట్టిన సమయంలో 12 ఫీట్ల రోడ్డుకు కుడి పక్కన 24 ఫీట్లు, ఎడమ పక్క 24 ఫీట్లు, మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 12 ఫీట్ల పక్కన ఉండాల్సిన మెయిన్ పైపులైన్ 24 ఫీట్ల రోడ్డు వేసిన క్రమంలో 24 ఫీట్ల మేరకు పక్కకు మార్చాల్సి ఉంది. అయినా గత పాలకులు, అధికారులు నిర్లక్ష్యంతో పాత పైపులైన్‌పైనే పాత సీసీకి ఆనుకుని మరో 12 ఫీట్ల సీసీ వేశారు. అలా ఇప్పటివరకు మూడు సార్లు రోడ్డుకు మధ్యలో సీసీ వేయడంతో సుమారు అర కిలోమీటర్ మేరకు పైపులైన్ నీరు లీకై రోడ్డుపై పారుతోంది. అంతేకాకుండా సీసీ రోడ్డుకు మధ్యలో ఏర్పాటు చేసిన గేట్‌వాల్వ్ నుంచి నీరు పైకి వస్తూ కలుషితం అవుతోంది. దీంతో కొన్నేళ్లుగా గ్రామానికి సరఫరా అవుతున్న కలుషిత నీటినే ప్రజలు తాగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిసీ పట్టించుకోవడం లేదంటూ పలువురు మండిపడుతున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం వేసిన పాత పైపులైన్ల మరమ్మతులకు అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం గ్రామపంచాయతీ సిబ్బందికి తలనొప్పిగా మారుతోంది. గ్రామం మొత్తానికి కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ అనుమతి పొందేలా వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు చొరవ చూపి నిధులు మంజూరు చేయించి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

పైపులైన్ల లీకేజీతో నీరు కలుషితం



పర్వతగిరిలో వాహనాలు ప్రయాణిస్తున్న క్రమంలో సీసీ రోడ్లపై నుంచి తాగునీరు ప్రవహిస్తోంది. ఈ విషయమై ఆరాతీయగా సీసీ రోడ్ల మధ్య తాగునీటి పైపులైన్ ఉందన్న విషయం వెలుగు చూసింది. వాహనాల రాకపోకలతో నీరు కలుషితమై గేట్‌వాల్వ్‌లోకి వెళుతోంది. ఈ క్రమంలో తాగునీరు పూర్తిగా కలుషితం అవుతున్న దుస్థితి నెలకొంది. ప్రభుత్వం పాత పైపులైన్ మొత్తాన్ని తొలగించి కొత్తగా పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలి.

-జిల్లా కృష్ణ, గ్రామస్తుడు, పర్వతగిరి

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం



గ్రామంలో సుమారు 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారానే నీరు సరఫరా అవుతోంది. నాటి నుంచి ఇప్పటివరకు కొత్త పైపులైన్ వేయలేదు. లీకేజీలు చోటు చేసుకుంటున్న విషయం వాస్తవమే. నాడు వేసిన పైపులైన్లకు మరమ్మతులు చేయాల్సి వస్తే ప్రస్తుతం ఆ పరిపరాలు లభించడం లేదు. గ్రామంలో కొత్త పైపులైన్ వేసి సురక్షితమైన నీరు అందించే దిశగా ప్రతిపాదనలు తయారు చేయాల్సి ఉంది. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం.

-రఘు, పంచాయతీ కార్యదర్శి, పర్వతగిరి

కేఎంటీపీలో వైద్యశిబిరం



గీసుకొండ : సీఎం రేవంత్‌రెడ్డి సందర్శన నేపథ్యంలో మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంటీపీ)లో గీసుకొండ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అర్చన, ఆయుష్ వైద్యాధికారి రేవతి, సీహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అందించాలి

తొర్రూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించాలని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. డివిజన్ కేంద్రంలో శనివారం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అధ్యాపకుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారిలో పేద విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ఉంటారని చెప్పారు. ఈ క్రమంలో వారి సౌకర్యార్థం ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయాలని సూచించారు. హడావుడిగా ఉదయాన్నే భోజనం చేయకుండా పేద బిడ్డలు కాలేజీ తరగతులకు హాజరవుతారని, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తే విద్యలో రాణిస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి గంటి రవి, జాయింట్ సెక్రెటరీ తిరుమలరావు, నాయకులు పోడేటి రవీందర్‌లు పాల్గొన్నారు.

మరమ్మతు పనుల్లో అప్రమత్తత కీలకం

గూడూరు: విద్యుత్ మరమ్మతు పనులు అప్రమత్తత కీలకమని డీఈ విజయ్‌కుమార్ అన్నారు. గూడూరు శివారు వడ్డెరగూడెంలో శనివారం ఏడీఈ కె. కవిత ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని గూడూరు, అయోధ్యపురం సెక్షన్ల విద్యుత్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలను వెంటనే సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈలు, సబ్ ఇంజనీర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకుడికి పరామర్శ



గీసుకొండ : ఎల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మారెడ్డి, నాయకులు



పర్వతగిరి : బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దేవేందర్‌రావు

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారం ప్రాంతానికి చెందిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గట్టికొప్పుల రాంబాబు, అతడి సోదరుడు రమేశ్‌లను వారి తల్లి ఎల్లమ్మ ఇటీవల మృతి చెందగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత ఎల్లమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వసంతాపూర్‌లో మృతి చెందిన రాపల్లి సత్తెమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుంకరి మనీషా శివకుమార్, గద్దె బాబు, బీఆర్‌ఎస్ నాయకులు గోలి రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

విలేకరికి..

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఓ పత్రిక విలేకరి కొల్లూరి నాగరాజుని అతడి కుమారుడు రేవంత్‌కుమార్ ఇటీవల మృతి చెందిన క్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు పరామర్శించారు. రేవంత్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందికట్ల అనిల్, నాయకులు ఆడెపు కుమారస్వామి, రవీందర్ పాల్గొన్నారు.

ఊకల్‌లో..

రాయపర్తి : మండలంలోని ఊకల్ గ్రామంలో దీకొండ కరుణాకరక్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని స్థానికుడు పాల శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం బియ్యం, నగదు సాయంగా అందజేశారు. కార్యక్రమంలో పాల యాకన్న, తేరాల మధు, మూడిక యాకన్న, దీకొండ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి



తొర్రూరు: మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాల కల్పనకు స్థానికులు సహకారం అందించాలని టౌన్ ప్లానింగ్ విభాగం రీజినల్ డైరెక్టర్ ప్రసాద్ అన్నారు. పట్టణంలో కొనసాగుతున్న డ్రెయినేజీల నిర్మాణ పనులను శనివారం కమిషనర్ శాంతి కుమార్‌తో కలిసి పరిశీలించారు. డ్రెయినేజీల నిర్మాణంలో స్థానికుల అభ్యంతరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రసాద్ మాట్లాడాఉ. అభివృద్ధి పనులు జరుగుతున్న తరుణంలో కొంత అసౌకర్యం కలిగే నేపథ్యంలో స్థానికులు సహకరించాలని కోరారు. డ్రెయినేజీల ఏర్పాటుతో రోడ్లపై మురుగు సమస్య తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈ రంజిత్, టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేషీ పాల్గొన్నారు.